క్లుప్తంగా

ఘనంగా కెల్విన్ జయంతి

నరసన్నపేట: భౌతిక శాస్త్రవేత్త కెల్విన్ గొప్ప శాస్త్రవేత్త అని నరసన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెల్విన్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. థెర్మో డైనమిక్ సిద్ధాంత పరిశోధనకు, కాంతి విద్యుదయస్కాంత సిద్ధాంతానికి చెందిన ప్రాథమిక అంశాలను ప్రపంచానికి సవివరంగా పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. గణిత శాస్త్రవేత్తగా, మేధావిగా ప్రసిద్ధి చెందారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, భౌతిక శాస్త్ర, తెలుగు అధ్యాపకులు పి.ఢిల్లీశ్వర రావు, రవికుమార్ పాల్గొన్నారు.

174 మందికి వైద్య పరీక్షలు



హిరమండలం: వైద్య పరీక్షలు చేపడుతున్న వైద్య సిబ్బంది

హిరమండలం: హిరమండలం, కొత్తూరు మండలాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 174 మందికి వైద్య పరీక్షలు చేశారు. హిరమండలం మండలంలోని అంబావల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో అమ్మన్నమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమ వారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రమ్య 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు రమేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దిమిలిలో

కొత్తూరు: మండలంలోని దిమిలి గ్రామంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దిమిలిలో కిడ్నీ రోగులతోపాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న 100 మందికి వైద్య పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, దారపు శ్రీరామకృష్ణ, రామకృష్ణ, కామక త్రినాథరావు, రాజులు నాయుడు, మెలియాపుట్టి జెడ్పీటీసీ సభ్యుడు అంజయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

గ్రామ ధార్మిక జట్ల నిర్మాణం చేపట్టాలి

హిరమండలం: జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ధర్మాన్ని కాపాడేందుకు గ్రామ ధార్మిక జట్లు ఏర్పాటు చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలక త్రినాథ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హిందూ ధర్మం ఎంతో ప్రాచీనమైనదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో హైందవ ధర్మంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర మహిళా సభ్యులు ఇందిరాదేవి, జోనల్ ధర్మ ప్రచారక్ గంగాధర్, జిల్లా కన్వీనర్ ఆర్.రమణమూర్తి, సహ కన్వీనర్లు మురళీమోహన్,రాంప్రసాద్, డి.యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాల పట్టివేత

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి 20 టీన్ బీర్‌లతో ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నామని ఎస్ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. టీన్ బీర్‌లను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వృద్ధులు

పాతపట్నం: మండలంలోని 30 మంది వృద్ధులను విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు వైద్యురాలు వై.రత్నప్రియ తెలిపారు. సోమవారం బూరగాం జడ్డమ్మ తల్లి ఆలయం వద్ద వృద్ధులు బస్సులో బయలుదేరి వెళ్లారు. గ్రామంలో 120 మందికి శంకర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రహ్లాద పుల్లాయ్, వైస్ సర్పంచ్ ఉపేంద్ర, ఎంపీటీసీ సునీత ఆఫ్టో, క్యాంప్ ఇన్‌చార్జి టి.రామారావు, శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు శుభాకాంక్షలు



సాయిదీక్షత్

బూర్జ: మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ తులగాపు సాయిదీక్షిత్‌కు సచివాలయ ఉద్యోగులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం అమరావతిలో జరిగిన సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్‌లో కమిటీ సభ్యుడిగా సాయిదీక్షిత్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.డీ జాన్‌పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాన్‌పాషా ప్యానల్‌కు చెందిన 21 మంది సభ్యుల్లో సాయిదీక్షిత్ ఉన్నారు.

తస్మాత్ జాగ్రత్త!

- ఎరువులు, విత్తనాల వాడకంలో రైతన్నలు అప్రమత్తంగా ఉండాలి
- ఆర్బీకేల సిబ్బంది సలహాలు పాటించాలి

సరుబుజ్జిలి:

వరి విత్తనాలు, వెదలు జల్లడంలో రైతులు బిజీగా ఉన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువుల ఎంపిక కీలకం. పంట దిగుబడి సాధించాలంటే రైతుకు భూసారం కాపాడడం చాల అవసరం. ఇందులో ఎరువులు, పురుగులు మందులు వినియోగం చాల కీలకం. సంప్రదాయ పద్ధతులు పాటిస్తూ.. సేంద్రియ ఎరువుల వినియోగంతో కూడా వీటిని నివారించగలం. భూమిని కన్నతల్లిగా.. వ్యవసాయమే జీవనాధరంగా బతుకుతున్న రైతన్నకు కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులు అంటకట్టి నిలువునా ముంచుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారించినప్పటికీ కొందరు వ్యాపారులు తమ దందాను కొనసాగిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారు. ఇదే సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎరువులు, పురుగులు మందులు, విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

కల్తీలను గుర్తించడం ఇలా..

ప్రస్తుతం చలామణిలో ఉన్న ఎరువులు, పురుగు మందులను పోలిన ప్రత్యామ్నాయంగా మరో పేరుతో సహజంగా విక్రయిస్తుంటారు. అలాంటి వాటిని జాగ్రత్తగా గురించాలి. ఎరువులు గడ్డకట్టి ఉంటే వాటిలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తాయి. వీటి ధర తక్కువగా ఉన్నప్పటికీ వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతుంటారు. ఎరువులు, పురుగులు మందులు కొనుగోలు చేసే సమయంలో వాటి ఎంఆర్‌పీ ధర చూడాలి. తక్కువ ధరకే అమ్మకాలు చేస్తామని నమ్మబలుకుతారు. ఇదే సమయంలో అప్రమత్తం చాలా అవసరం.



మందులు పిచికారీ చేస్తున్న రైతు

పురుగు మందుల వినియోగం ఇలా..

ఏ పంటకు ఏ ఎరువు, ఏ పురుగు మందు వాడాలో ఆర్బీకేల్లో పనిచేస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్లను రైతులు సంప్రదించాలి. రైతులు కోరిన మేరకు వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు మేరకు పురుగులు మందులు పిచికారీ చేయాలి. మందు పేరు, రూప, శాతం, పరిమాణం, జాగ్రత్తలు, తయారు చేసే సంస్థ పేరు, గడువు, రిజిస్ట్రేషన్, ఏ పంటకు వాడకూడదో అనే వివరాలు క్లుప్తంగా పరిశీలించాలి. లేబుల్ లేని డబ్బాలు, సీసాలు, ప్యాకెట్లు కొనుగోలు చేయకూడదు. సీలు లేని మందులు కొనుగోలు చేయకూడదు.

ఆమదాలవలస నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)..		
మండలం	సాగు విస్తీర్ణం	రైతులు
సరుబుజ్జిలి	5200	3456
బూర్జ	6201	3643
పొందూరు	7211	4457
ఆమదాలవలస	7890	4890

సూచనలు పాటించాలి



పురుగు మందులు, కలుపు నివారణ మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. అధిక రసాయన ఎరువులు వాడడం వల్ల పంటకు నష్టంతోపాటు భూసారం కూడా కోల్పోతుంది. సేంద్రియ ఎరువులపై మొగ్గుచూపితే నకిలీ ఎరువులు, పురుగుల మందుల బెడద నుంచి తప్పించుకోవచ్చు. దీనివల్ల అధిక దిగుబడి సాధించవచ్చు.

– బొడ్డేపల్లి పద్మనాభం, వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పొందూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పొందూరు: గ్రామాల అభివృద్ధి, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటా సంతోషాన్ని నింపుతున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడ ఎంతో ఆనందంగా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్, నాయకులు గార రమణ, కిల్లాన సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి

నరసన్నపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డి మళ్లీ కొనసాగితేనే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని కామేశ్వరిపేట సచివాలయం పరిధిలో కొత్తపోలవలస, నర్సింగరాయుడుపేట, జల్లువానిపేట, పాలకొండపేటల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. రానున్న ఐదేళ్లు ఇటువంటి పథకాలు నిరంతరంగా కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న కావాలని ప్రతిఒక్కరూ దీవించాలని కోరారు. టీడీపీ ఎన్నికల కోసం జిమ్మిక్కులు చేస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యేకు కొత్తపోలవలస సర్పంచ్ వెంకట శ్యామ్‌కుమార్, పార్టీ నాయకులు మహేష్, పట్ట రాజు తదితరులు స్వాగతం పలికారు. ఈ పంచాయతీ పరిధిలో పలువురు తమ సొంత స్థలాల్లో పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సచివాలయ కన్వీనర్ సురంగి నర్సింగరావు, సర్పంచ్‌లు పుట్ట ఆదిలక్ష్మి, పోలాకి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: కొత్తపోలవలసలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన



పదో తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సర్పంచ్ వాణీసీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులతోపాటు, నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం అన్నారు. తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం అందజేశారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి జామి మేఘన ప్రథమ స్థానం సాధించడంతో రూ.3 వేలు, ద్వితీయ స్థానం పొందిన కంచరాపు కీర్తన, పట్ట భాగ్యశ్రీలకు రూ.4 వేలు, తృతీయస్థానం పొందిన జామి గాయిత్రీకి రూ.1000 నగదు ప్రోత్సాహకంతోపాటు మెడల్స్‌తో సత్కరించారు. హెచ్‌ఎం జె.స్వప్నప్రియ, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు, ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సులు

ఆమదాలవలస రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయిలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులు అందిస్తున్నామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోర్సుల్లో భాగంగా ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అసోసియేట్ ఎలక్ట్రిషన్ లో రెండు కోర్సులకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులన్నారు. కోర్సులు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఫోన్ 7569077449 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆప్తుల్ని కోల్పోయాను..



తలసముద్రం సర్పంచ్ శ్రీనివాసరావు అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: సమాజం పట్ల బాధ్యత, ఆదర్శభావాలు కలిగిన ఇద్దరు ఆప్తుల్ని కోల్పోయానని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తలసముద్రం సర్పంచ్ భావన శ్రీనివాసరావు అనారోగ్యంతో, అరుణోదయ పాఠశాల కరస్పాండెంట్ హనుమంతు శ్రీరాములు గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. శ్రీరాములు స్వగ్రామం మగతపాడు, శ్రీనివాసరావు స్వగ్రామం తలసముద్రంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాసరావు అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, విశ్వశాంతి, ప్రగతి పాఠశాలల డైరెక్టర్లు జనార్దనరావు, గణపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

- తాగునీటి కుళాయిల ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం



దివంజీపేటలో తాగునీటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో దివంజీపేట గ్రామంలో రూ.46 లక్షల నిధులతో నిర్మించనున్న ఇంటింటా తాగునీటి కుళాయిల కార్యక్రమానికి శంకుస్థాపన, సైలాడ, కుమ్మరిపేట గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.48 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటింటికీ తాగునీటి కుళాయిల కార్యక్రమానికి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, సర్పంచ్ సైలాడ దాసునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొంటి కృష్ణ, గురుగుబెల్లి నీలారావు, మానుకొండ వెంకటరమణ, బమ్మిడి అచ్యుతరావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.పి.సూర్యనారాయణ, జేఈ కె.చంద్రమౌళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

పొందూరు: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ. 85 లక్షలతో కుళాయిల నిర్మాణం చేస్తున్నామన్నారు. మూడు నెలల్లో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పార్టీ నాయకులు కిల్లాన సూర్యారావు, గార రమణ, గాడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



సత్యనారాయణను సత్కరిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న ఆణిముత్యాలు వంటి బృహత్తరమైన పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, హెచ్‌ఎం తులసీరావు, పీఎంసీ చైర్మన్ అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కొత్తరోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వేరొక ప్రాంతానికి వేగవంతంగా మార్పులు చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. మండలంలో అక్కివరం పంచాయతీ కొత్తరోడ్డు జంక్షన్ వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను సోమవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నందున రహదారి పక్కన ఉన్న స్తంభాలను తొలగించి రోడ్డు మార్గానికి ఇబ్బందులు లేకుండా యంత్రాల సహాయంతో స్తంభాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ హైవోల్టేజీ, ఎల్‌టీ లైన్‌లకు అవసరమైన స్తంభాలను ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. స్తంభాలు ఏర్పాటు వల్లకొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని, వినియోగదారులు గ్రహించాలని సూచించారు. ఈ పరిశీలనలో లైన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ లైన్‌మన్ తమ్మినేని కృష్ణారావు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

స్పందనకు 71 వినతులు



పాతపట్నం: వినతులు స్వీకరిస్తున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాతపట్నం: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని టెక్కలి సబ్ కలెక్టర్ ఎం.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బైదలాపురం గిరిజన గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం డివిజన్ స్థాయి జగనన్నకి చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. అన్ని శాఖలకు సంబంధించిన అర్జీలు మొత్తం 71 అందాయన్నారు. కొత్తూరు మండలం దిమిలి, రాయల గ్రామాల్లో కిడ్నీ రోగులు 38 మంది ఉన్నారని వారికి కురిగాం సీహెచ్‌సీలో డయాలిసిస్, మందులు అందించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వై.సూర్యం, ఎస్.ప్రదీప్ వినతిపత్రాలు అందజేశారు. పాతపట్నం మండలంలోని శోభ పంచాయతీ పరిధిలోని 14 గిరిజన గ్రామాలు ఉన్నాయని, గిరిజన గ్రామాలకు ప్రత్యేక పంచాయతీగా కావాలని గిరిజనులు, ట్రైబ్స్ కోఆర్డినేటర్లు ఆర్.హేమలత, రామకృష్ణలు విన్నవించారు. ఆర్‌ఓ పట్టాలను అందజేయాలని పలువురు గిరిజనులు వినతిపత్రాలు అందజేశారు. కొటబొమ్మాళి మండలం కస్తూరిపాడులో ప్రభుత్వ స్థలాల అక్రమణలను తొలగించాలని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పలు సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. హౌసింగ్‌శాఖ ఈఈ పి.వి.జోగారావు, డీఈఈ నర్సింగరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.మధుసూదనరావు, ఆర్అండ్‌బీ డీఈఈ సాగర్, విద్యుత్‌శాఖ డీఈఈ ప్రసాద్, పంచాయతీ రాజ్‌శాఖ డీఈ ఆర్.ఎస్.ప్రసాద్, ఐసీడీఎస్ పీఓ విమలరాణి, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణకరరావు, తహసీల్దార్ రవిచంద్ర, ఉపతహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించాలి

బూర్జ: పిల్లలు చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ కనబర్చాలని పాలవలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రతాప్ రుద్రరావు అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న అమ్మఒడి, జగన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, ఆణిముత్యాలు తదితర పథకాల గురించి వివరించారు. విద్యాకమిటీ చైర్‌పర్సన్ జె.శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాయినింగ్ ఆర్డర్లు అందజేత



జాయినింగ్ ఆర్డర్లు అందజేస్తున్న ఎంఈఓ రమణ

సారవకోట: ఇటీవల ఎంపికైన (1998, 2008 డీఎస్సీల్లో) ఉపాధ్యాయులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో 1998–డీఎస్సీలో ఎంపికైన ఐదుగురు, 2008–డీఎస్సీలో ఎంపికైన ఒక ఉపాధ్యాయుడికి రీ జాయినింగ్ ఆర్డర్లు సోమవారం అందజేశారు. వీరికి సొంత మండలాలలో పోస్టింగ్ ఇవ్వాలని ఉన్నతాధికారుల సూచించారు. వేరే మండలాల్లో పనిచేసిన వీరికి కౌన్సెలింగ్‌లో సొంత మండలాల్లో నియమించినట్లు ఎంఈఓ తెలిపారు.

అమ్మఒడి వివరాలు సరిచూసుకోవాలి

హిరమండలం: అమ్మఒడి పథకానికి సంబంధించిన వివరాలను సరిచేసుకోవాలని ఎంఈఓ కె.రాంబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సీఆర్పీలు, ఐఆర్టీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. అమ్మఒడి పథకానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

మెళియాపుట్టి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని పెద్దపద్మాపురం, మెళియాపుట్టి గ్రామాలను సోమవారం సందర్శించారు. పెద్దపద్మాపురంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో రోడ్డు పక్కనే చెత్త పేరుకుపోవడంతో పరిశీలించి వెంటనే తొలగించాలన్నారు. అనంతరం మండల విస్తరణ అధికారి తారకేశ్వరి, పలువురు కార్యదర్శులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వమిత్వ సర్వే వేగవంతం చేయాలన్నారు.

పేరెంట్స్ కమిటీలతో పాఠశాలల అభివృద్ధి

జలుమూరు: పేరెంట్స్ కమిటీలతో పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. మండల పరిధిలోని పలు పాఠశాలలో నిర్వహించిన పాఠశాలల పేరెంట్స్ కమిటీల ఎన్నికలను సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్‌తో కలిపి 83 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు జరిగాయన్నారు.

కౌలు హక్కు పత్రాల పంపిణీ

కొత్తూరు: పంట సాగుదారు హక్కు పత్రాల మంజూరుతో ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలు పొందవచ్చని పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. ఓంద్రుజోల ఆర్‌బీకేలో మండలంలోని 74 మంది కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలను సూర్యనారాయణ సోమవారం అందజేశారు. ఏఓ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకరాలు సౌజన్య, వీఆర్వో హరిహరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి ఎస్‌ఎస్ కాలనీ ప్రాథమిక పాఠశాల స్థలం ఆక్రమణకు గురైనట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దు హరిదాసు సోమవారం టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు చెందిన స్థలం ఖాళీగా ఉన్నందున కొంతమంది ఆక్రమిస్తున్నారని తెలిపారు. ఆక్రమణలను తొలగించాలన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

పాతపట్నం: మత్తుకు బానిస కావద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) సీఐ వై.లక్ష్మనాయుడు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ ఆధ్వర్యంలో పాతపట్నంలో విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు.

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ ఎస్‌ఈబీ అధికారులు ర్యాలీ చేపట్టారు.

బూర్జ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్య నిరోధక, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి ఆర్ఐఓ, ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్సై బి.అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ టి.హేమ మందిర పాల్గొన్నారు.

పొందూరు: పొందూరులో ఎస్‌ఈబీ ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎస్‌ఈబీ సిబ్బంది ర్యాలీ చేపట్టారు.